# రక్షణనిధి

యద్దనపూడి సులోచనారాణి

ప్రియమైన తాతయ్యకి,

నేనిక్కడ యిప్పటివరకూ కులాసాగానే వున్నాను. నన్ను ఎత్తుకొచ్చినవాళ్ళు చాలా సమర్థులైన దొంగలు. వీళ్ళకి డబ్బు తప్ప యింకేమీ అవసరం లేదు. నీ దగ్గర నుంచి డబ్బు వస్తుంది అన్న ఆశ వున్నంత కాలం నన్ను బాగానే చూస్తారు. డబ్బు రాదని తెలిస్తే నన్నెలా శిక్షిస్తారో వూహించాలంటే కూడా భయంగా వుంది. నేనెక్కడున్నానో నాకు తెలియదు. ఇదొక పెద్దగది. ఈ గదిలో గోడకి ఒకపెద్ద కన్నంలాటిది వుంది. అందులోనుంచే నాకు కావాల్సిన గాలి వెలుతురు వస్తుంది. నేనీ కూపంలో యింకా ఎన్నాళ్ళుండాలో! భయంతో నా ప్రాణం బిగుసుకుపోతోంది. నా యీ వుత్తరం నీకు చేరగానే వెంటనే 20000 రూపాయిలు కేరాఫ్ పోస్టుమాస్టర్, పోస్టుబాక్స్ — 28కు అందించవలెను. డబ్బు అందగానే నన్ను మనయింటికి సురక్షితంగా చేరుస్తాం అంటున్నారు. నువ్వు ఏ మాత్రం ఆలస్యం చేసినా, సందేహించినా నేను కొత్తచిక్కుల్ని ఎదుర్కొనవలసివస్తుంది. కాబట్టి దయయుంచి వెంటనే డబ్బు పంపవలెను.

ఎప్పుడెప్పుడు నిన్ను చూస్తానా అని ప్రాణం చిక్కబట్టుకుని ఎదురుచూస్తున్న,

నీ మనుమరాలు,

రాధ.

"అయిందా?" నా ఎదురుగుండాకుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్న అన్నయ్య అడిగాడు.

"అయింది. కానీ, యిలా ఆ ముసలాయన్ని ఏడిపించినందువల్ల నీకేం వస్తుంది?" అన్నాను.

"ఆయనకి బుద్ధి, నాకు డబ్బు రెండు వస్తాయి." నేనిచ్చిన కాగితంలోకి చూస్తూ అన్నాడు.

"ఏమోబాబు. నాకేం నమ్మకం లేదు."

అన్నాను సందేహంగా.

"చూస్తూండు. అహింసా ప్రయోగంతో ఆయననుంచి డబ్బు రాబట్టటానికి ఇది నా ఆఖరి ప్రయత్నం. ఇదికూడా కాకపోతే_?"

"కాకపోతే?"

"హింస ప్రయోగించాల్సివస్తుంది."

"నీ మొహం. తాతయ్యమీద యీగ వాలనిస్తానా నేను?" అన్నాను.

అన్నయ్య నవ్వాడు. "మరి ఆయనమీద నీకున్న అభిమానంలో వెయ్యోవంతయినా నీమీద వుంటే మనం అడిగిన డబ్బు పంపిస్తాడు. ఒకవేళ పంపించడనుకో; నువ్వంత అపాయంలో వున్నా డబ్బు అంటిపెట్టుకుని కూర్చున్నాడంటే, అలాంటి మనిషికి ఎలాటి అనుభవం జరిగినా నువ్వు విచారించ నవసరంలేదు." నేను రాసిచ్చిన వుత్తరం కవరులో పెడుతూ అన్నాడు.

"ఏమోబాబూ! డబ్బు యిచ్చినా యివ్వకపోయినా నాకు తాతయ్యమీద అభిమానం ఆవగింజంతకూడా మారదు."

"డబ్బివ్వడే అనుకుందాం. ఏంచేస్తావు?" అన్నాను. ఎందుకయినామంచిది, వాని ఆలోచన తెలుసుకుని వుండటం శ్రేయస్కరం అనుకుని.

"ఏం చేస్తానా! తాతయ్యని షూట్ చేసేసి ఆ డబ్బంతా రక్షణనిధికియిచ్చి, నేను జైలుకి పోతా."

"మా గొప్పపని చేస్తావు," అన్నాను నవ్వుతూ.

"చూస్తూండు." అన్నాడు గర్వంగా.

తాతయ్యమీద వాడి కంతకోపం ఉండడం సహజమే. ఏం చెయ్యాలి! తాతయ్యకి డబ్బంటే ప్రాణం. అన్నయ్యకి దేశం అంటే ప్రాణం. రక్షణనిధికి ఒక పదివేలు యివ్వమంటాడు అన్నయ్య.

"పదివేలే! నా కంఠంలో ప్రాణం వుండగా 10 పదులుకూడా యివ్వను. ఇదేం నాకు తాతముత్తాతలు సంపాయించి పడేసిపోయిన ఆస్థికాదు. కష్టార్జితంరా! కష్టార్జితం," అంటాడు తాతయ్య.

"కష్టార్జితం! సిగ్గులేదాతాతయ్యా ఆమాట అనటానికి నీకు? ఇంట్లో కూర్చుని కాలు కదపకుండా, వున్న డబ్బువడ్డీలకిచ్చి, పాపం, వాళ్ళు ఆ వడ్డీలకి తట్టుకోలేక చివరికి అసలు తీర్చలేకపోతే, వాళ్ళ ఆస్థులు వేలంవేయించి

సంపాయించిన ముదనష్టం కదూ యిదంతా?–" అన్నయ్య అనేవాడు.

"ఔన్రా! ముదనష్టమే. ఆ ముదనష్టం రక్షణ నిధికి యిస్తే అచ్చిరాదు. పో!" అని అరిచేవాడు తాతయ్య.

తనమాటలు తనకే ఎదురుతిరగటంతో అన్నయ్య మండిపడేవాడు.


"ముదనష్టంత, ముదనష్టం. దాన్ని నువ్వు సంపాయించ రాదూ! చూద్దాం." అన్నయ్య అక్కడినుంచి వెళ్ళిపోయిన అరగంట వరకూ గింజుకుంటూనే వుండేవాడు.

చిన్నప్పటినుంచీ వీళ్ళిద్దరిమధ్యా పచ్చగడ్డి పడేస్తే భగ్గుమనడం అలవాటే. ఒకళ్లు తూర్పు ఒకళ్ళు పడమరా. వాళ్ళిద్దర్నీ పెనవేసుకుని వున్న నా జీవితం, చాలాసార్లు కఠినమైన పరీక్షలని ఎదుర్కొనవలసి వచ్చింది.

చిన్నప్పుడే మా అమ్మా, నాన్నా పోయారు. మా అమ్మతరఫునవాళ్ళెవరైనా మా బాధ్యత తీసుకుంటారేమో, యీ బరువు వదిలించుకోవచ్చు అని మా తాతయ్య మహా చూశాడు. కానీ వీలుపడలేదు. పసితనంనుంచీ మమ్మల్ని బాగా అదుపులో పెట్టాలని ఆయన తాపత్రయపడేవాడు. అన్నయ్య అప్పుడే ఎదురు తిరిగేవాడు. అన్నయ్యకి చిన్నప్పటినుంచీ ఐస్‌క్రీమ్ అంటే చాలా యిష్టం. తాతయ్యని డబ్బు లడిగేవాడు. "వద్దు. జలుబు చేస్తుంది. మరమరాలు తిను," అనేవాడు తాతయ్య.

"నీలాటి ముసలాళ్ళకి జలుబు చేస్తుంది. మా కేం చెయ్యదు. తే పావలా!" అనేవాడు వీడు.

"దొంగ భడవా! నాకు జబ్బు చేయాలని కోరుకుంటున్నావా?" తాతయ్య ప్రక్కనే వున్న వెండిపొన్ను కర్ర ఎత్తేవాడు. అన్నయ్య చేతిలో వున్న దేదో ఆయన ముఖం మీదకి విసిరేసేవాడు. దాంతో యిద్దరూ కలబడేవారు. ఎంతయినా తాతయ్య పెద్దవాడు కాబట్టి చివరికి ఆయనే గెలిచేవాడనుకోండి. కాని యీ కాస్త లోకే చిన్నయినా తనెంత బలమైన శత్రువో చూపించటానికి అన్నయ్య తన్ని, కొరికి, నానా హంగామా చేసేవాడు.




తాతయ్య అన్నయ్యని చెవిపట్టిలాక్కెళ్ళి, గదిలోకి తోసి, తలుపులు మూసి, గడియ బిగించి, వంటమనిషి నాయర్‌తో "ఈ వెధవకి నేను చెప్పేవరకూ అన్నం పెట్టకు." అనేవాడు ఆయాసంతో వగురుస్తూ. గదిలో బందీ అయిపోయిన అన్నయ్య తలుపులు గుద్దుతూ, అచ్చు తాతయ్య గొంతులా పెట్టి "తలుపు తీయరా దొంగ భడవా! లేకపోతే చంపేస్తా. ఈ గదిలో వురేసుకుని చచ్చిపోయి దెయ్యమై రాత్రికి నీ గుండెలమీద కూర్చుని నీ మీసాలు పీకుతా," అని కేకలు పెట్టేవాడు.

నాకు ఒకవైపున తాతయ్య అన్నయ్యని గదిలో పెట్టి గడియ వేశాడని ఆయనమీద విపరీతమైన కోపం వచ్చేది. మళ్లీ అప్పుడే మరోప్రక్క అలా చిన్నా పెద్దా చూడకుండా అన్నయ్య తాతయ్యని తిడుతుంటే, బాధగాకూడా అన్పించేది. చివరికి రాను రాను, యిద్దరూ బద్ధశత్రువులమధ్యన మధ్యవర్తిలా ఎప్పుడూ ప్రవర్తించటంతో, యింట్లో ఎప్పుడూ ఇదే గొడవ అవడంతో, నాకు వయసుకి మించిన గాంభీర్యం, ఆరిందాలా తీర్పు దిద్దటం వచ్చేసినాయి.

ఒకసారి – అంటే 7, 8 సంవత్సరాల క్రితం – అప్పటికి నాకు పది, పన్నెండు సంవత్సరా లుంటాయి–ఆరోజు అన్నయ్య, తాతయ్య దేనికోసమో పోట్లాడుకున్నారు. తాతయ్య అన్నయ్యని బాగా తిట్టి, భోజనం అదీ అయింతర్వాత మామూలుగా గదిలోకి వెళ్ళి పడుకుని నిద్రపోయాడు. ఆయన నిద్రలేచేసరికి గదితలుపు తాళం వేసివుంది. ఇంట్లో అన్నయ్య లేడు. తాళంచెవి మాయమైంది. ఇక చూడండి – ఆరోజు గొడవ. ఆ గదిలోంచి యింకోదోవలేదు. తాతయ్య తలుపు బాదుతూ కేకలేస్తూంటే వంటాయనా, నేనూ పరుగెత్తుకువచ్చాం. "ఎవడ్రా బైట గడియవేసింది? దొక్క చీరేస్తాను. తీయ్ తలుపు." కిటికీలోంచి తాతయ్య నాయర్ వైపు చూస్తూ హుంకరించారు. నాయర్‌కి అసలే తాతయ్యంటే హడలు. అందులో యిలా శివంగిలా గంతులేస్తూన్న ఆయన్ని చూసేసరికి అసలు మతిపోయింది.

తాళం వేసి వుందనీ – తాళంచెవి లేదనీ

తెలిసేసరికి తాతయ్యకి ఆవేశం వచ్చింది. ఆవేశం రాగానే ఆయాసం వచ్చింది. ఆయాసం వస్తే వెంటనే ఆయన గడ గడా గ్లాసుడు మంచినీళ్ళు తాగాలి.

"మంచినీళ్లు తేరా పీనుగా!" అన్నాడు నాయర్ని. నాయర్ జి. టి. స్పీడులో వంట యింట్లోకి పరుగెత్తి గ్లాసుతో తెచ్చాడు. కానీ అది లోపలికి వెళ్ళే మార్గంలేదు. ఆ గదికి ఒకేఒక పెద్ద కిటికీ వుంది. అదికూడా పాతకాలం చువ్వలున్న కిటికీ. మా యింట్లో వున్నవికూడా నాలుగే నాలుగు కంచు గ్లాసులు. ఎంత ప్రయత్నం చేసినా మంచినీళ్ల గ్లాసు లోపలికి దూరలేదు.

తాతయ్య విపరీతంగా ఆయాసపడి పోతున్నాడు. జీవితంలో ఒకే ఒకసారి నాయర్ మొద్దుబుర్ర చురుగ్గా పనిచేసింది. ఒకేసారి స్వంత అభిప్రాయాన్ని ధైర్యంగా అమలుపరిచాడు. పరుగెత్తుకెళ్ళి గునపం లాటిది తెచ్చి, తాళం బద్దలుకొట్టాడు. తాళం చాలాగట్టిది. ఓపట్టాన వూడలేదు. దాన్ని వధించేసరికి నాయర్‌కి చెమటలు పట్టాయి. ఎలాగయితే నేం చివరికి తలుపులు తెరుచుకున్నాయి. అప్పటికి తాతయ్యకి ప్రాణం పోయినంత పనైంది. నాయర్ మంచినీళ్ళు తీసుకెళ్ళి యివ్వగానే గడగడా తాగేసి వెంటనే తాతయ్య చేసిన మొదటిపని ఏమిటో తెలుసా? నాయర్ జుట్టుపట్టి వంగదీసి వీపుమీద బలంగా రెండుగుద్దులు గుద్ది, ఆ దవడా యీ దవడా వాయించాడు. పాపం! నాయర్ కిక్కురు మనలేదు.

"ఏడీ ఆ కోతివెధవ? యింటికి రానీ. ఈరోజు రక్తం కళ్ళ చూస్తాను." అంటూ తాతయ్య వెండిపొన్ను వున్న చేతికర్ర పట్టుకుని హుంకరిస్తూ హాల్లో అటుయిటూ తిరుగుతూ రంకెలువేయసాగాడు.

"భగవంతుడా! ఎలాగైనా యీరాత్రికి మా అన్నయ్యని యింటికి రానివ్వకుండా చెయి తండ్రీ." మనసులోనే ప్రార్థిస్తూ ఓ మూల పిల్లిలా కుర్చున్నాను. కాస్త శబ్దం విన్పిస్తేచాలు తాతయ్య హుంఅంటూ ముందుకెళ్లేవాడు. నాప్రాణం ఎగిరిపోయినట్టయేది. కానీ దేవుళ్లు నామొర ఆలకించారు. అన్నయ్య ఆరాత్రి యింటికి రాలేదు. ఎంతో అదటుగా, బిగబట్టుకుని కుర్చోవడంవల్ల నాకు నీరసం వచ్చేసింది.

అన్నయ్య ఆరాత్రేకాదు, ఆ మర్నాడు, మూడోరోజుకూడా రాలేదు. తాతయ్య కోపం తగ్గిపోయింది. నాలుగోరోజుకూడా రాకపోవడం తాతయ్యకి ఆదుర్దా పట్టుకుంది. నేనయితే ఏడుపే లంకించుకున్నాను. తాతయ్యకికూడా ఖంగారేసింది కాబోలు, నా చెయ్యిపట్టుకుని 'మా వెధవ్వచ్చాడా?' 'మా భ్రష్టుడు కన్పించాడా?' అంటూ యిల్లిల్లూ తిరిగాడు.

ఎవరూ తెలియదన్నారు.

చివరికి ఆరోరోజు సాయంత్రం రైల్వే స్టేషనులో, బట్టలు మాసిపోయి, ఎర్రబడిన కళ్ళతో, మొహం పీక్కుపోయి, సలసల కాగుతున్న ఒళ్ళుతో 104 డిగ్రీలు జ్వరంతో, చలికి ఒణుకుతూ అన్నయ్య కన్పించాడు. నేను అన్నయ్యని చూడగానే అమాంతం వెళ్ళి కావులించుకుని బావురుమన్నాను. తాతయ్యకూడా దగ్గరకు వచ్చి నుదుటిమీద చెయివేసి 'ఇంటికిపోదాం రా' అన్నాడు. అన్నయ్య ససేమిరా రాను అన్నాడు. మా గొడవ చూసి అక్కడే డ్యూటీమీదవున్న ఒక పోలీసు అధికారి దగ్గరకువచ్చి 'ఏమిటి?' అన్నాడు. తాతయ్య అన్నయ్యని చూపించి యింట్లోంచి పారిపోయి వచ్చాడని చెప్పాడు. పోలీసు అధికారి అన్నయ్యని తాకి చూసి 'బాగా జ్వరం వుంది' అని 'ఇంటికి వెళ్ళు బాబూ!' అన్నాడు మృదువుగా.

అన్నయ్య అడ్డంగా తల తిప్పుతూ "వెడితే మా తాతయ్య చంపేస్తాడండీ. వెళ్ళను." అన్నాడు.

పోలీసుఅధికారి తాతయ్యవేపు చూశాడు.

"అబ్బే! పిల్లాడికి జ్వరంగా వుంది కదూ! కాస్త సంధికూడా పుట్టినట్టుంది." అన్నాడు.

పోలీసు అధికారి మళ్ళీ అన్నయ్యవైపు చూశాడు.

అన్నయ్య ఆయన చేతిని పట్టుకుని, "లేదుసార్, లేదు. నేను ఆల్‌సెయింట్స్‌లో చదువుతున్నాను. మీరు కావాలంటే వెళ్ళి మా టీచర్స్‌ని నా ప్రవర్తన గురించి అడిగి చూడండి. నా ఫ్రెండ్స్ అందరికీ కూడా తెలుసు. ఇయనంటే నా కెంత భయమో వాళ్ళుకూడా చెప్తారు మీకు. సార్, నన్ను మాత్రం మా తాతయ్యతో పంపకండి."

పోలీసుఅధికారి అన్నయ్యని దగ్గరకు తీసుకుని తల నిమురుతూ తాతయ్య వైపు కొరకొరా చూశాడు.

నేనప్పుడు ముందుకు వచ్చి అన్నాను: "మా తాతయ్య ఏమీ అనడు. మమ్మల్నిద్దర్నీ మా అమ్మా నాన్నా పోతే పెంచి, పెద్దచేసి, చదువూ అదీ చెప్పిస్తున్నారు. మా అన్నయ్య తప్పుచేసి పారిపోయివచ్చాడు. అందు కా యింటికి రావటానికి భయపడుతున్నాడు."

"ఏం తప్పు చేశాడు? ఏదయినా దొంగతనమా?" అన్నా డతను

"ఉహూ."

"ఏం చేశాడు?"

"నేను తాతయ్యవైపు చూశాను. తాతయ్య నా వైపు చూశాడు. నేను పోలీసు అధికారితో అన్నా. "నన్ను బాగా కొట్టాడు. అంతే కాదు; మా యింట్లో ఎవరూలేనిసమయంలో నన్ను గదిలోపెట్టి గొళ్ళెం వేసి పారిపోయాడు."

"అబద్ధం, అబద్ధం. నేను మా చెల్లెల్ని కాదు.. తాతయ్యే నిద్రపోతుంటే అలా చేశాను. గొళ్ళెం కాదు; తాళమే వేశాను." అన్నాడు అన్నయ్య.

పోలీసుఅధికారి తాతయ్య వైపు కుతూహలంగా చూశాడు. చివరికి ఎలాగైతే నేం ఆయన అన్నయ్యకి నచ్చచెప్పి యింటికి పంపించాడు. మేం బయల్దేరేముందు పిల్లల లేతమనసుల్ని పెద్దవాళ్లు ఏ యే విధంగా జాగ్రత్తగా చూడాలో హెచ్చరికలు


చేశాడు. ఈ రోజుల్లో యువకుల్లో కన్పించే అక్రమవర్తనకి చాలావరకూ మీ పెద్ద వాళ్ళే బాధ్యులన్నట్టు మాట్లాడాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, సూటిగా తాతయ్యని 'మీలాంటివాళ్ళ మూలంగానే యీ ప్రపంచంలో నేరాలు చేసేవాళ్ళు ఎక్కువవుతున్నారు' అన్నట్టు మాట్లాడాడు. ఆయన లెక్చర్ని బలవంతాన దిగమింగుతూ నిలబడిన తాతయ్య చేయి చేతికఱ్ఱమీద బిగుసుకోటం చూస్తున్న నేను, ఓ క్షణంలో అది గాలిలోకి లేచి పోలీసుఅధికారి బుఱ్ఱ పగులగొట్టుందా అని భయంగా చూస్తున్నాను. కాని ఎందుకో ఆ పని జరగలేదు.

ఆ సాయంత్రం ఆయన మా యింటికి స్వయంగా వచ్చి, అన్నయ్య క్షేమంగా వున్నాడో లేదో, సదుపాయాలు జరుగుతున్నాయో లేదో కనుక్కువెళ్ళాడు.

ఆ సంఘటన జరగగానే తాతయ్య అన్నయ్యని హాస్టల్లో చేర్పించేశాడు.

ఇంట్లో వాతావరణం తెరిపిగా అయింది. తాతయ్యకి విశ్రాంతిగా వుండేది. కానీ యీ విశ్రాంతి, యీ తెరిపి అంతా శలవులు వచ్చాయంటే చాలు, రూపులేకుండా పోయేది. అన్నయ్య శలవులకు రాగానే 'ఏదయినా వూరు వెడతా డబ్బివ్వు' అనేవాడు. తాతయ్య యిచ్చేవాడుకాదు. కోపంవచ్చిన అన్నయ్య ఏదోదాన్ని తన్నటమో, విరక్కొట్టడమో చేసి బైటికెళ్ళిపోయేవాడు. జరిగిన నష్టాల్ని చూసి తాతయ్య లబోదిబో మనేవాడు. దాంతో గుండెదడ, ఆయాసం. నాకు రాత్రులు నిద్ర లేకపోవటం. ఆయన విశ్రాంతిగా వుండాలని డాక్టర్ నాకు హెచ్చరికలు యిచ్చేవాడు. రాను రాను తాతయ్యనీ అన్నయ్యనీ సాధ్యమైనంతదూరంగా వుంచటం నాకో పెద్ద పనైపోయింది.

అన్నయ్యా, నేనూ పెద్దవాళ్ళంఅవటంతో మా అవసరాలుకూడా పెరిగినాయి. కానీ తాతయ్య వాటిని గుర్తించేవాడు కాదు. అక్కడే వచ్చేది పెద్ద యిబ్బంది. కానీ నేను ఎలాగో అలాగు సరిపెట్టుకునేదాన్ని.



అన్నయ్య సరిపెట్టుకునేవాడు కాదు. ఆ వంక ఆధారం చేసుకుని తాతయ్యని ఏడిపించటం వాడికీ సరదాగా, ఆనందంగా తయారైంది చివరికి.

ఈ మధ్య యీ పాకిస్థాన్ దురాక్రమణతో అందరి హృదయాల్లో దేశభక్తి చైతన్యం ఆవంతిలా వుప్పొంగింది. అన్నయ్యకూడా అందులో తలమునకలుగా మునిగిపోయాడు. నాక్కూడా చాలా సంతోషం అన్పించింది. తెలివితేటలూ, యుక్తీ వున్నవాళ్ళకి జీవితంలో ఒకధ్యేయం, ఒక గమ్యం చాలా అవసరం. అది లేకపోతే ఆలోచనలన్నీ వక్రమార్గాన పడి పతనం వైపు లాగుతాయి. అన్నయ్య నాయకత్వంతో కాలేజి తరపునుంచి చాలా కష్టపడి నిధి పోగుచేశారు. పది వేలు తక్కువగా రెండులక్షలు వసూలయింది. అన్నయ్య ఏమైనాసరే ఆ మొత్తం తాతయ్య వద్దనుంచి రాబట్టాలని నిశ్చయించుకున్నాడు.

స్టూడెంట్స్ అందరితో కలిసివచ్చి అడిగాడు. వాళ్ళు తాతయ్యని కూర్చోబెట్టి ఇంద్రుడవని, చంద్రుడవని, దానకర్ణుడవని గంటసేపు పొగిడారు. అంతా విన్నతర్వాత తాతయ్య జేబులోంచి పర్సు తీసి 10 రూ. రెండుసార్లు లెక్కబెట్టి వాళ్ళ కిచ్చాడు. వచ్చినవాళ్ళ ముఖాలు మాడిపోయినాయి. అన్నయ్య ముఖం ఎఱ్ఱబడింది. ఏం ఘర్షణ జరుగుతుందో అని అక్కడే కూర్చున్నా.

"ఇది మా కాఫీలకా సార్ ?" అన్నాడు ఒకతను వెక్కిరింతగా.

"అబ్బ! అనవసరంగా గంట కాకా పట్టాం. గొంతులన్నీ ఎండిపోయినాయి." ఇంకో అమ్మాయి మూతి విరిచి, మొహం తిప్పేసుకుంటూ అంది. అందరూ లేచి పోయారు. బైట కెళ్ళగానే వాళ్ళు తాతయ్య గురించి ఎలా అనుకుంటారో నాకు క్షుణ్ణంగా తెలుసు.

ఆ సాయంత్రం యింటికి రాగానే అన్నయ్య సరాసరి తాతయ్య గదిలోకి వెళ్ళాడు. నేనుకూడా వెంటే వెళ్ళా. అన్నయ్య అంటున్నాడు. "తాతయ్యా! నువ్వు మధ్యాహ్నం మర్యాదగా ఏ వందో రెండువందలో యిచ్చినట్టయితే పోయేది. యివ్వకుండా వాళ్ళందరిలో నన్ను అవమానం చేసేశావుగా. దానికి ఫలితంగా పది వేలు అది నీనుంచి రాబట్ట దలుచుకున్నాను."

"పదివేలు!" గుడ్లు పెద్దవిచేసి చూసి, ఆవెంటనే పొట్ట వూగిపోయి, ఒళ్ళంతా అదిరిపోయేలా నవ్వాడు తాతయ్య. ఆయనంత బిగ్గరగా విరగబడి నవ్వటం నేనెప్పుడూ చూడలేదు.

అన్నయ్య కోపంగా చూశాడు.

"పదివేలు! మీ అమ్మకి మీ తాత ముల్లె కట్టి యిచ్చి పంపిందేనా?" అని మళ్ళీ నవ్వాడు. అమ్మ పేదకుటుంబంలోంచి వచ్చింధని, నాన్న అమ్మని కావాలని, కానీ

కట్నం లేకుండా చేసుకున్నాడని, దానికి తగిన శిక్ష ఆవిడ కాపురానికి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే అనుభవించిందని తెలిసిన వాళ్ళు మాకు చాలామంది చెప్పారు.

అమ్మ మాట ఎత్తగానే అన్నయ్య మండిపడ్డాడు. తాతయ్య చాలాసార్లు అన్నయ్యని అమ్మపోలిక అంటూ దెప్పిపొడిచేవాడు. నేను అచ్చు మా నాన్నలా మెత్తని స్వభావమట. అన్నయ్య అమ్మలా చాకులాటి మనిషిట. అందుకే అన్నయ్యని దూరంగా వుంచి, నన్ను దగ్గిరకు తీసుకోవటం జరిగిందేమో అనుకుంటాను అప్పుడప్పుడూ.

"తాతయ్యా! మాటలు అనవసరం. నువ్వేడబ్బూ యివ్వద్దు. నా ఆస్థి నాకు పంచి యివ్వు." అన్నాడు అన్నయ్య.

"ఆస్థి! నీకా?" తాతయ్య మళ్ళీ వుప్పెనలా నవ్వాడు. అన్నయ్య దవడదగ్గిర ఎముకలు కదలడం చూశాను. ఆయన నవ్వు అయిపోయేవరకు శాంతంగా కూర్చున్నాడు.

"ఆస్థి, ఆస్థి. నీతాత తాత నాకేం సంపాయించి యిచ్చిపోలేదు. నా స్వార్జితంరా యిది; స్వార్జితం." తాతయ్య గుండెలు కొట్టుకుంటు చూపించాడు. "రాత్రింబవళ్లు కష్టపడి సంపాయించుకున్నాను. వున్నాన్నాళ్లూ అనుభవించుకొంటానో, దాచుకుంటానో అది నాయిష్టం. ఇంకా నేను సద్ధర్మ్ముణ్ణి కాబట్టి నీకు చదువూ, సంధ్యా చెప్పించి, ఇన్నాళ్లూ తిండీ, బట్టా యిచ్చాను. అదికూడా యీ రోజుతో సరి. పోరా – పో!–"

"తాతయ్యా!"

"ఏం? అరిస్తే భయపడతాననుకున్నావా? కుర్రకుంకా! నాదగ్గిరా నీ కుప్పిగంతులు. పో! మళ్ళీ ఏ పోలీసుకన్నా రిపోర్ట్ చేసుకో – ఊఁ! ఇంకా నిలబడ్డావేం?" తాతయ్య ధోరణి చూస్తే దిక్కున్న చోటున చెప్పుకోమన్నట్టుంది.

అన్నయ్య ఎద్దూ, మొద్దూ అన్నా భరిస్తాడు గాని, కుంకా, భడవా అంటే మాత్రం అగ్గిమీద గుగ్గిలం అవుతాడు. నేను వచ్చి అడ్డుపడే లోపలే తాతయ్యమీదికి వురికాడు. ఇద్దరూ కలబడ్డారు. తాతయ్య చేతికర్ర యెత్తాడు. అది తీసుకుని అన్నయ్యని కొట్టబోతే గురి తప్పింది. దాంతో ఆయన నేలమీద బోర్లాపడ్డాడు. పడ్డవాడు వెంటనే లేవలేదు. అప్పటికే నేను అన్నయ్యని బలవంతంగానే వీపు పట్టి గదిలోంచి బైటకి తోసి తలుపులు వేసేశాను. క్రిందపడిన తాతయ్య కదిలాడుకాని లేవలేదు. దగ్గరగావెళ్ళిచూస్తే, "అమ్మడూ! నడుం విరిగిపోయిందమ్మా." అని కేకపెట్టాడు. నిజంగా భయంవేసింది. తాతయ్యని నాయర్ సాయంతో ఎలాగో మంచంమీద పడుకోబెట్టి డాక్టర్‌కి కబురు చేశాను. ఆయనవచ్చి దెబ్బ తగలలేదనీ, నొప్పి పట్టిందనీ, నాలుగైదు రోజుల్లో తగ్గిపోతుందనీ చెప్పాడు. అన్నయ్య ఆయన క్లినిక్‌కి వెళ్ళి మందు తెచ్చాడు.

తాతయ్యకి ఆరాత్రి జ్వరం వచ్చింది. అన్నయ్య హఠాత్తుగా మారిపోయాడు. వాడంతట వాడు వెళ్ళి, తాతయ్య మంచం ప్రక్కన నిలబడి కన్నీళ్ళతో, 'తాతయ్యా, క్షమించు,' అంటుంటే నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను.

"తాతయ్యా! యీ దెబ్బ నావల్ల తగిలింది. నువ్వు మందు అశ్రద్ధచేయకండా పుచ్చుకో. డబ్బుకోసం చూడకు. నేనెక్కడైనా కూలిచేసి అయినాసరే నా కష్టంతో సంపాయించి, నేనే యిచ్చి, ప్రాయశ్చిత్తం చేసుకుంటాను. తాతయ్యా! కాళ్ళు పట్టనా?–" దగ్గరగా వచ్చాడు.

తాతయ్య పెద్దగా మూలుగుతూ, నా చెయి గట్టిగా పట్టుకుని "అమ్మో! అమ్మడూ! వీడేహో పెద్దఎత్తులో వున్నాడే తల్లీ. ఏ అర్ధరాత్రివేళ నా గొంతు పిసికేస్తాడో! నువ్విక్కడే వుండవే అమ్మా!" అన్నాడు.

అన్నయ్యవెంటనేదూరంగావెళ్ళి గుమ్మం దగ్గరగా నిలబడి "తాతయ్యా! నీ కలాటి అనుమానం వుంటే నే నీ చాయలకుకూడా రాను. యికనుంచీ నీ పర్మిషన్ లేందే యీ గదిలో అడుగుకూడా పెట్టను. నన్ను నమ్ము." అని గదిలోంచి వెళ్ళిపోయాడు.

"వీడు నిజంగానే రాడంటావా?" నావంక తాతయ్య అనుమానంగా చూశాడు.

"నువ్వు శాంతంగా పడుకుని విశ్రాంతి తీసుకో తాతయ్యా! నీకు దెబ్బ తగిలేసరికి భయంవేసినట్టుంది. నిజంగానే మారినట్టు కన్పిస్తున్నాడు," అన్నాను.

తాతయ్య నొప్పి మేం అనుకున్నంతగా తగ్గలేదు. నాలుగురోజులు అనుకున్నది వారం అయింది; వారంఅల్లా రెండు వారాలు పట్టింది. నాలుగురోజులు గడవగానే అన్నయ్య ఒక నర్స్‌ని తీసుకువచ్చాడు. వాడు ఆరోజు అన్నట్టుగానే తాతయ్య పర్మిషన్ లేందే గదిలో అడుగుపెట్టటం లేదు. పైనుంచి చెప్పినట్టుగానే మందులు బత్తాయిలు గ్లూకోజ్ అన్నీ తనే తెస్తున్నాడు.

"రాధా! రాత్రింబవళ్ళు మేలుకుంటే నీ ఆరోగ్యం చెడిపోతుంది. నువ్వు మూలపడితే యీ యిల్లే మూలపడుతుంది. నీ తీరికవేళలో మాత్రమే తాతయ్య దగ్గిరుండు. మిగతా అన్ని సమయాల్లో తాతయ్యకి నర్స్ చేస్తుందిలే," అన్నాడు.

వాడి ఆపేక్షకి నిజంగా నా కళ్ళలో నీళ్ళు నిల్చాయి. నాలుగు రోజులనుంచీ నాయర్‌కి కూడా జ్వరంగా వుంది. అటు యింట్లో వంటపనీ, యిటు తాతయ్య పనీ, నాకు వూపిరి సలపటం లేదు. ఇంతయినా అన్నయ్య అన్నయ్యే! వా డెంతమారాడు! తాతయ్యని గురించి పశ్చాత్తాపపడటమే కాకుండా, నా గురించిన శ్రద్ధకూడా తీసుకుంటున్నాడు అనుకున్నాను.

అన్నయ్య పరిచయం చేయగానే నర్స్ నాకు నమస్కారం చేసింది. నల్లటి మనిషేమో! వేసుకున్న డ్రెస్ మరింత తెల్లగా కన్పిస్తోంది. వయసు ముప్ఫయ్యోపడి దాటివుంటుంది. దిబ్బ మొహం. గద్ద ముక్కు, బండ పెదవులు. వికృతంగా కన్పించేవాళ్ళ దగ్గరనుంచి ఆదరణా, ఆప్యాయతా దొరుకుతాయని ఎక్కడో చదివాను. నాకు బుద్ధి తెలిసింతర్వాత

మొట్టమొదటిసారిగా యింట్లో మరో ఆడ మనిషి మసులుతూంది అన్నమాట. తీసుకెళ్ళి తాతయ్యని చూపించాను. మొదట ఆయన అనుమానంగా చూశాడు. వద్దన్నాడు. డబ్బు నువ్వు యివ్వనవసరం లేదు అనేసరికి పోన్లే వుండనీ అన్నాడు.

నర్స్ వచ్చింతర్వాత నాకు కాస్త విశ్రాంతి దొరికింది. తాతయ్య ప్రక్క గదిలోనే పడుకునేదాన్ని. అవతల గదిలోంచి తాతయ్య 'నర్సమ్మా' అని పిలుస్తూండేవాడు.

"నర్సమ్మా!"

"ఏవిటండీ; 'నర్స్' లేక 'సిస్టర్' అని పిలవక, మీరు పేర్లు ఖలేఖూనీ చేస్తారులా వుంది," అంది.

"పేరులో ఏముందిలే నర్సమ్మా," అంటున్నాడు.

'ఔనౌను. మనిషిలో ఎలాటి ప్రత్యేకతా లేనప్పుడు పేరులో అయినా వుండి తీరాలి' అనుకున్నాను కళ్ళు మూసుకుంటూ.

"మా అబ్బాయి నీకు జీతం ఎంత యిస్తానన్నాడు?"–"అసలు నీకూ వాడికీ పరిచయం ఎన్నాళ్ళనుంచీ?" – "నీకు పెళ్ళయిందా?"– "కాలేదూ? ఎందుకనీ" యిలా లోకాభిరామాయణంగా కబుర్లు చెబ్తూండేవాడు తాతయ్య.

నాకు కాస్త నిశ్చింతగానే అనిపించసాగింది.

ఆరోజురాత్రి నేను వంటయింటిలో పని ముగించి, తలుపులు వేసి, గాలికోసం అలా దొడ్లోకి వెళ్ళాను. దొడ్లోంచి మాటలు విన్పించాయి. చటుక్కున ఆగిపోయాను.



అన్నయ్య కంఠం తగ్గించి రహస్యంగా అడుగుతున్నాడు.

"ఏమైనా దారికి వస్తున్నాడా?"

"ఏందారికయ్యా బాబూ! ముసలిఘటం చాా గడుసుపిండంలా వుంది; దూర దూరంగా వుండి చాకిరీ ఎంతయినా చేయనిస్తాడు గాని, దగ్గిరగా రానేరానివ్వడు. ఏమోబాబూ! నాకేం నమ్మకంలేదు."

"నర్స్, ప్లీజ్, నువ్వు నిజంగా తలుచుకుంటే పని కాకుండా పోదు. నీ మీద ఎంతో ఆశ పెట్టుకున్నాను." అన్నయ్య బ్రతిమిలాడుతున్నాడు.

"నాకు తెలుసు. నిన్ను నిరాశపరచటం కూడా నా కిష్టంలేదు. కానీ అసలది నూనెలో వున్న వత్తిఅయితేగదా అగ్గిపుల్ల గీస్తే అంటుకోవటానికి?–"

"నర్స్, ప్లీజ్!"

ఎంత ఆలోచించినా వాళ్ళ సంభాషణకి అర్థం ఏమిటో నాకు అంతుబట్టలేదు. కాని ఒకటిమాత్రం తెలిసింది. అన్నయ్య పశ్చాత్తాపం నిజం కాదనీ, యిదంతా దేనికోసమో

నాటకం అనీ. కాకపోతే నా పిచ్చిగాని సూర్యుడెక్కడన్నా పడమర వుదయిస్తాడా?

అదేరాత్రి— నాకు నిద్ర పట్టీ పట్టనట్టుగా వుంది. దాదాపు అర్ధరాత్రి అయివుంటుంది. వున్నట్టుండి తాతయ్య గదిలోంచి "అమ్మో! నాయనో! అమ్మడూ! అబ్బాయి గోపీ—'' అంటూ అరుపులు విన్పించాయి. నేను ఒక్క వుదుటులో మంచంమీదనుంచి వురికి, తాతయ్య గదిలోకి పరిగెత్తాను గదిలో లైట్లు లేవు. నా ఒల్లు ఝల్లుమంది. లైటు వేసే లోపలే గుండెలు వణికిపోయినాయి. ఏ భయంకరమైన దృశ్యం చూడబోతున్నానో అని కంపించిపోయాను. తీరా లైటు వేస్తే, తాతయ్య మంచంమీద తలవైపు వున్న పెద్ద తలగడామీదికి ఎక్కి పిల్లిలా ముడుచుకుని కూర్చునివున్నాడు. ఆయన మంచానికీ, గోడకీ మధ్యగా నర్స్ తప్పు చేసినదానిలా నిలబడివుంది. నా కేమీ అర్థం కాలేదు.

తాతయ్య చిన్నపిల్లాడిలా చెయి జాస్తూ "అమ్మలూ! వచ్చావా! నాతల్లే, ముందీ కోతిమొహందాన్ని బైటకి గెంటు." అన్నాడు.

నేను 'ఏం' జరిగింది అన్నట్టు నర్స్‌ను చూశాను. నర్స్ నా వైపు తీక్షణంగా, తాతయ్య వైపు ఓ గొంగళి పురుగుని చూసినట్టు చూసి గదిలోంచి చర చరా బైటకి వెళ్ళిపోయింది.

"ఏం జరిగింది తాతయ్యా?" అన్నాను.

"ఏం జరిగిందా? ఏం చెప్పనే తల్లీ! దాని మొహం మండా! దానిబుద్ధి కాలిపోనూ. నే నింకా గోపీగాడికి గాలం వేస్తూందేమో అనుకున్నా. నాకే వేసింది. దీపాలన్నీ తీసేసి, కట్టు దాచేసి— తల పట్టమంటారా అంటూ దగ్గరగా వచ్చి..." తాతయ్య హఠాత్తుగా సిగ్గు డిపోయాడు.

నేను వుబికివస్తున్న నవ్వుని దాచుకోటానికి చాలా శ్రమపడాల్సివచ్చింది.

మర్నాడు అన్నయ్యని కూర్చోపెట్టి, పాపం, తాతయ్య అమాయకంగా నర్సమ్మ దుర్బుద్ధిని గురించి చెబుతుంటే నాకు జాలేసింది. ఆరాత్రి దొడ్లో వాళ్ళిద్దరి సంభాషణా వినకపోతే నేనుకూడా ఇందులో అన్నయ్య కేం తెలియదనీ, అంతా నర్స్‌దే పాడుబుద్ధి అనీ నమ్మేదాన్ని. పాపం, నర్స్ గుర్తొస్తే జాలేసింది.

తాతయ్య గదిలోంచి యివతలకు రాగానే అన్నయ్యమీద విరుచుకుపడ్డాను. "నీకు బుద్ధి వుందా లేదా?"

"ఏమిటి?" ఏం తెలియని అమాయకుడిలాగా అడిగాడు.

ఒళ్లు మండిపోయింది నాకు. "చాల్లే నీ నాటకం. నే నంతా విన్నా," అన్నాను.

అన్నయ్య అర్థమైనవాడిలా 'ఉ...హు' అంటూ నోటితో విచిత్రంగా యీలవేశాడు.

"సిగ్గులేదురా నీకు. పెద్దాయిన అనైనా చూడకండా."

"నా కేం తెలుసు. ఎక్కడైనా కాస్త రోమాన్స్ ఏడిచిందేమో అనుకున్నా." పాంట్ జేబుల్లో.చేతులు పెట్టుకుని కొంటెగా నవ్వి, పెదవి విరుస్తూ—

"ప్చ్! కాదు," అన్నాడు.

'వీడు మా అన్నయ్య! చెప్పుకోటానికి కూడా సిగ్గుపడాలి నేను,' అన్పించింది నాకా క్షణంలో.

నర్సమ్మతో పోట్లాడడంతో తాతయ్య నడుంనొప్పి అనుకోకుండా పోయింది. శుభ్రంగా లేచి తిరగడం మొదలుపెట్టాడు.

నాలుగైదు రోజులతర్వాత ఓరోజు అర్ధరాత్రి, వీధితలుపు ఎవరో టకటక బాదారు. నేను లేచివస్తుండగానే తాతయ్య వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగుండా పోలీసులు నిలబడి వున్నారు.

మా యిద్దరికీ అర్థంగాలేదు.

"ఏంకావాలి మీకు?" తాతయ్య అడుగుతోనే వున్నాడు. వాళ్లు తాతయ్యనీ నన్నూ ఓప్రక్కగా నిలబడిమని తుపాకులు గురిపెట్టారు. మిగతా యిద్దరూ యిల్లంతా సోదా చేశారు. అనుకోని యీ అఘాయిత్యానికి తాతయ్యా నేనూ తెల్లబోయి మొహమొహాలు చూసుకున్నాం. ఇద్దరుపోలీసులూ వెళ్ళి ఇల్లంతా గాలించిపారేశారు.

చివరికి ఇద్దరూ తిరిగివస్తూ "ఏం దొరకలేదు సార్" అన్నారు.

"అదుగో!" వున్నట్టుండి ఒకపోలీసు చూపించాడు. అందరూ అటు తిరిగారు. వాళ్ళలో ఒకతను సూటిగా పిస్టల్ గురిపెట్టాడు. కాంపౌండ్ గేటు తెరుచుకు నాయర్ వస్తున్నాడు. మా నాయర్‌కి ఒక వింత అలవాటుంది. అప్పుడప్పుడూ కళ్లుమూసుకుని నడుస్తాడు. 'ఎక్కడన్నా పడిపోవా?' అంటే, ఎందుకు పడిపోతాను; బాగా అభ్యాసం చేసుకున్నాను. కళ్ళుమూసుకుని మైళ్ళదూరం నడవమన్నా నడుస్తా' అంటాడు.

ఇందాక పడుకోబోయేముందు "అమ్మాయిగారూ! పనంతా అయిపోయింది. రాజేశ్వరిలో 'నామా ఒరుపిణ్ణు' సినిమా వచ్చింది చూస్తాను అంటే, డబ్బిచ్చి వెళ్ళిరమ్మనమని పంపేను. మా యింటికీ థియేటర్‌కీ ఆట్టే దూరం లేదు. సినిమా అయిపోయింది కాబోలు. నెత్తిమీద వుత్తరీయం అడ్డంగా వేళాడేసుకొని, కళ్లుమూసుకుని నడుస్తూ వస్తున్నాడు. గేటు తీశాడు. మేమంతా వూపిరి బిగబట్టి చూస్తున్నాం. వాడు కళ్ళు మూసుకుని ఎందుకు నడుస్తున్నాడో వాళ్ళకి అర్థంగా లేదేమో. పోలీసులుకూడా విచిత్రంగా చూస్తున్నారు. నాయర్ అలవాటు ప్రకారం దొడ్డిదోవవైపు వెళ్ళబోతున్నాడు.

"ఏయ్ ఆగు." పోలీసు అధికారి గద్దించాడు. హఠాత్తుగా అన్న ఆయనమాటకి ఏమరిపాటుగా వున్న నేనుకూడా వులిక్కిపడ్డాను. నాయర్ చటుక్కున కళ్ళు తెరచి చూచాడు. కళ్ళెదుట చూస్తున్న దేమిటో బహుశా వాడికి వెంటనే అర్థమైవుండదు. కాసేపు నావంకా, తాతయ్యవంకా, వాళ్ళ వైపూ మార్చి మార్చి చూశాడు. కనురెప్పలు టకటకా కొట్టుకున్నాయి. ఆవెంటనే 'అమ్మ బాబోయ్' అంటూ పోలీసు ఆఫీసర్‌ముయ బోర్లాపడిపోయాడు. వాడు పడగానే అంతక్రితం యిల్లువెతికిన పోలీసులు యిద్దరూ

గబగబా వచ్చి జేబులు వెతికారు. ఒక బీడీకట్ట, రెండణాలు చిల్లర, సగం చించిన సినిమాటిక్కెట్ తప్ప యింకేం దొరకలేదు. పోలీసులు మొహాలు చూసుకున్నారు.

తాతయ్య ధైర్యం తెచ్చుకుని అసలు సంగతేమిటో చెప్పమని వాళ్ళని అడిగాడు. సమాధానంగా పోలీసు ఆఫీసర్ జేబులోంచి ఒక వుత్తరం తీసి చూపించాడు. ఎవరో ఆకాశరామన్న వ్రాసిన వుత్తరం అది. అందులో యిలావుంది :

ఈరోజు రాత్రి సరిగ్గా 2 గంటలకి మీరు ఫలానవీధిలోని ఫలాన యింటికి వెళ్ళి హఠాత్తుగా వెతికితే, అక్కడ మన దేశం లోంచి రహస్యాలు శేకరించి, పాకిస్థాన్ పంపుతున్న ముఠా ఆచూకీ దొరుకుతుంది.


ఆ వుత్తరం చూడగానే తాతయ్యముఖం పాలిపోయింది.

"ఎవరో గిట్టనివాళ్ళు రాసిందని తెలుస్తూనేవుంది," అన్నాడు.

"సారీ సర్. మా డ్యూటీ మేం చేశాం," అంటూ క్షమార్పణ చెప్పుకుని వెళ్ళిపోయారు వాళ్ళు. తాతయ్యకి చాలామంది శత్రులు వున్నారుకాబట్టి ఆయనకంతగా అలోచనరాలేదు. కానీ, ఆ గిట్టనివాళ్ళెవరో నాకు బాగా అనుమానం తగిలింది. ఒకటి మాత్రం నిజం. ఈ క్షణంనుంచీ పోలీసు కన్ను ఒకటి మాయింటిమీద వుంటుందని నాకు తెలుసు. 'వుంటే వుండనీ. మన కేం భయం ?' అన్నాడు తాతయ్య.

అన్నయ్య మనసులో వేసుకున్న పథకం అమలు పరిచేముందుగా తాతయ్యకి పోలీసు లంటే హడలు పుట్టటానికి యిది చేశాడని తర్వాత నా కర్థం అయింది.

ఆరోజు వుదయం అన్నయ్య వూరు వెళ్ళాడు. వెళ్ళేముందు డబ్బువిషయంలో యిద్దరూ తగాదాపడ్డారు. 'జన్మలో యీ యింటి గడప తొక్కను. తొక్కితే నేను చచ్చినంత ఒట్టు' అనేసి వెళ్ళిపోయాడు అన్నయ్య. 'ఓయబ్బో! యిలాటి కూతలు యిప్పటికి నీ నోటినుంచి ఎన్ని విన్నాను?' వెకసక్కెంగా అన్నాడు తాతయ్య. ఆరోజు మామూలుగానే గడిచిపోయింది. మర్నాడు కాక ఆ మార్నాడు రాత్రి, వేళపట్టున భోంచేసి పడుకున్నాం. తాతయ్య పడుకున్నాడు. నాకే ఎందుకో నిద్రపట్టలేదు. దూరంగా వున్న చర్చిగడియారం 12 గం_ కొట్టడం విన్నాను. వున్నట్టుండి నా బెడ్ లైటు పోయింది. సిటీల్లో వున్నవాళ్ళకి అప్పుడప్పుడూ యిలా కరెంట్ పోవటం అలవాటే. అర్ధరాత్రి అంతా నిద్రలో వుంటాం కాబట్టి బాధలేదు. నేను బలవంతంగా నిద్రకి వుపక్రమించే ప్రయత్నంలో కళ్ళు మూసుకున్నాను. యెక్కడో ఎవరో నడిచినట్టు అడుగుల చప్పుడు విన్పించింది. వెన్నెముకమీద భయంలాటిది జరజర ప్రాకింది.




అడుగులు మళ్ళీ విన్పించి, ఆగిపోయినాయి. లేచి కూర్చుని ధైర్యం తెచ్చిపెట్టుకుని 'ఎవరు ? నాయరా' అన్నాను.

పలకలేదు. అడుగుల చప్పుడు దగ్గరగా విన్పించింది. నేను భయంతో కెవ్వుమంటూ 'తాతయ్యా!' అని అరిచాను.

'అమ్మా!' అన్నాడు 'ఏమిటే తల్లీ, నిద్రలో కలవరిస్తున్నావా ?_'

"తాతయ్య, దొంగ_దొం_" నా వాక్యం పూర్తి కానేలేదు. ఎవరిదో చేయి వచ్చి నా నోరు గట్టిగా మూసేసింది. నేను చేయి విడిపించుకోటానికి పెనుగులాడుతున్నాను.

"ఆ! ఆ! ఏమిటది ? అమ్మడూ, మాట్లాడవేం ? నే వస్తున్నా_లైట్లేవీ?" తాతయ్య తలుపు తీసిన చప్పుడు విన్పించింది. ఈలోపలే జేబురుమాలు లాటి దానితో నా నోరు కట్టేశాడు. నన్ను పట్టుకున్న దొంగ చాలా బలిష్ఠుడులా వున్నాడు. ఒక చేత్తోనే నా రెండు చేతులూ కదలకుండా పట్టుకొని, వాటినికూడా గట్టిగా కట్టేశాడు. వెంటనే నన్ను ఎత్తి భుజంమీద వేసుకున్నాడు. నే నెంత పెనుగులాడినా లాభం లేకపోయింది,

అలా నన్ను భుజంమీద వేసుకునే హాల్లోంచి బైటకి వచ్చాడు. హాల్లో నాకు కన్పించిన దృశ్యం చూడగానే నా ప్రాణం పోయినంత పనైంది. తాతయ్యని పెడరెక్కలు విరిచి కుర్చీకి కట్టేస్తున్నాడింకో దొంగ. భయంతో నిలువునా గజగజా వణికిపోతున్న నాయర్ కూడా చేతులు కట్టేయబడి అక్కడే వున్నాడు. వాళ్ళిద్దరూ చూస్తూండగానే నన్ను వాళ్లు ఎత్తుకొచ్చారు.

నన్నెత్తుకొచ్చినఅతను యిక నాభారం మోయలేనట్టు యింటివెనక వున్న పచ్చ గడ్డిమీద తెచ్చి పడేశాడు. చంద్రుడు అప్పు డప్పుడే పైకి వస్తున్నాడు. గుడ్డివెన్నెల పరుచుకున్న ప్రపంచంఅంతా మసక మసకగా, చీకటి చీకటిగా వుంది. నేను అతన్ని కాళ్ళతో తన్నటానికి సిద్ధం అయాను. అతను ఆయాసంతో, అలసటగా 'నీకు పుణ్యం వుంటుంది. నన్ను తన్నకు. యిప్పటికే, నీ గోళ్లు నా బుగ్గల్ని గాట్లు పెట్టాయి. నే నెవరోకాదు. మీ అన్నయ్య స్నేహిడు ప్రసాద్‌ని. ఇదంతా మీ అన్నయ్య ప్లాన్. నువ్వింత బరువుంటావనికాని, యింతగొడవుంటుందనికాని తెలిస్తే చచ్చినా వచ్చేవాడినికాదు' అన్నాడు గబగబా. నాకు క్షణంసేపు నోట్లోంచి మాటరాలేదు. ప్రసాద్ నాకట్లు విప్పేశాడు. చేతులూ కాళ్లూ స్వాధీనంలో వున్నాయో లేదో నని విదిలించి చూచుకున్నాను. ఇంతలో బాటరీలైటు వేసి వెతికిచూస్తూ, అన్నయ్య అక్కడికి రానే వచ్చాడు. మా యిద్దర్నీ చూడగానే లైటు తీసేసి "యిదేమిట్రా, యిక్కడికి తీసుకు వచ్చావు ?" అన్నాడు విసుగ్గా.

"ఆగరా బాబు! నయం. యిక్కడికైనా తీసుకురాగలిగాను," అన్నాడు అయాసం తీర్చుకుంటూ ప్రసాద్.

"ఏమిటిదంతా," అన్నాను అన్నయ్యని కఠినంగా చూస్తూ. చీకటిగా వుండడంవల్ల వాడికి నాముఖంలో కోపం కన్పించివుండదని నాకు తెలుసు.

"తాతయ్య దగ్గరనుంచి డబ్బు లాగటానికి మరో ప్రయత్నం," అని కాస్త ఆగి "ఆఖరి ప్రయత్నం కూడాను," అన్నాడు.

"ఏడిసినట్లుంది. నేను వెళ్ళి తాతయ్యకి చెప్పేస్తా," అన్నాను లేవబోతూ. అన్నయ్య నన్ను వారించలేదు. నిదానంగా అన్నాడు: "చెప్పు; అభ్యంతరం లేదు. కానీ చెప్పిన అరగంటకి నా శవాన్ని చూస్తావు."

"బెదిరుస్తున్నావా ? _"

"ఊహు. నేనెందుకు చెబుతున్నానో అర్థం చేసుకో."

"ఏమిటో అది చెప్పు."

"ఇక్కడకాదు. ముందు పద. యిక్కడి నుంచి త్వరగా వెళ్ళాలి. నేను కావాలనే నాయర్ చేతులు లూజ్‌గా ముడేశాను. ఏక్షణంలోనైనా వాడు తాతయ్యకట్లు విప్పెయ్యవచ్చు. ఆయన వస్తే అంతా తలక్రిందు లవుతుంది. ఉ _ పద _ పద. ఇందులో ఎవరికీ ఎలాటి ప్రమాదంలేదు. నా యీ ఒక్కమాట వినవూ ! వింటావులే, నాకు తెలుసు. నా బంగారంకదూ ! మా రాధ ఎంతమంచిదని." అన్నయ్య ఓచెంప బ్రతిమలాడుతోనే మరోచెంప నన్ను చెయి పట్టి లేవదీసి బైటకి నడిపించాడు.

బైట ప్రసాద్‌ది స్కూటర్ వుంది. అన్నయ్య సైకిల్ కూడా వుంది. "మీ ఇద్దరూ నా స్కూటరుమీద వెళ్ళండి. నేను వెనక యీ సైకిల్ మీద వస్తా." ప్రసాదు తనగది తాళంచెవులు తనే అన్నయ్య కిచ్చాడు.

అన్నయ్యా, నేనూ ఎన్నెన్నో సందులు గొందులు తిరిగి, చివరికి పదిహేను నిమిషా లకి అతనిగది చేరుకున్నాం. అన్నయ్య నన్ను కూర్చోపెట్టి తను వేసుకున్న ప్లాన్ చెప్పాడు. నా ప్రాణానికి మోసం అని భయ పెత్తే తాతయ్యదగ్గరనుంచి డబ్బు వస్తుం దేమో నని వాడికి ఆశ. దొంగలు కాబట్టి ఎక్కువ మొత్తం వ్రాయాలని 20 వేలు అని వ్రాయించాడు. తాతయ్యకి నా మీద ప్రేమా, డబ్బుమీద ప్రేమా తేల్చుకుని డబ్బు మీదే ప్రేమ అని తెలిసిపోతే తాతయ్యతో చెప్పేసి, ఖచ్చితంగా మొహం పట్టుకుని నాలుగూ అడి[illegible]సి, ఇక యిద్దరం ఆ యింట్లో ఒక్కక్షణంకూడా వుండొద్దు అన్నాడు.

నేను అయిష్టంగానే ఒప్పుకున్నాను. మన సులో మారుమూలఎక్కడో అన్నయ్య చెప్పి నట్టు తాతయ్యకి నామీద ఎంతప్రేమవుందో తెలుసుకోవాలనే కుతూహలంకూడా కలి గింది. కానీ డబ్బుకీ, నామీద అభిమానానికీ సంబంధంలేదనీ, ఆయనకి యీ రెండూ విడి విడిగా ప్రధానమైనవే ననీ వివేకం హెచ్చ రించసాగింది.

అన్నయ్య వూరు వెడుతున్నానని చెప్పి తీసుకెళ్ళినవాటిల్లో సగం నాబట్టలే. ప్రసాదు అన్నయ్యకి స్నేహితుడు. ప్రస్తుతం హవుస్‌సర్జన్ చేస్తున్నాడు. అతను వుంటూంది అటు యిల్లూకాదు, ఇటు గదీ కాదు. ముందు ఎవరైనా వస్తే కూర్చునేం దుకు చిన్నగది _ ఆనుకుని కాస్తపెద్దగది. ఆ గదినే ఆనుకుని బాత్, లెట్రిన్ వున్నాయి. ముందుగదిలో ఒకపడక్కుర్చీ, వ్రాసుకునే టేబిల్, దానిమీద బాతు ఆకారంతో గమ్మత్ అయిన టేబిల్ లైటు, మరోమూలగా చిన్న స్టూలుమీద మంచినీళ్ళకూజా గ్లాసువున్నాయి. లోపల గదిలో పెట్టె, బెడ్డింగ్, మడతమం చము, చిన్నబట్టల స్టాండ్, పుస్తకాలదొంతర లున్నాయి.

నాకు ఆరాత్రి నిద్రే పట్టలేదు. అన్న య్యని లేపుదామని ముందుగదిలోకి వచ్చే సరికి వాడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. నా అలికిడి వినగానే ప్రసాదు కదులుతూ "ఏం కావాలి?" అన్నాడు.

"ఏం వద్దు," గిరుక్కున తిరిగివచ్చి తలుపులు మూసుకున్నాను. మడతమంచంపై పడుకుని "భగవంతుడా ! నన్ను త్వరగా మాయింటికి చేర్చు," అని ప్రార్థించసాగాను.

అన్నయ్య మార్నాడు తాపీగా అప్పుడే వూరునుంచి వచ్చినట్టుగా యింటికి వెళ్లాడు.

మధ్యాహ్నం ప్రసాద్ గదికి వచ్చాడు. వస్తూ క్యారియర్‌తో భోజనం తెచ్చాడు ఇద్దరికీ.

"మీరు తినండి. నేను తర్వాత తింటాను," అన్నాడు.

"మీరే ముందు తినండి," అన్నాను నేను.

"ఊహు. మీరే తినండి."

చివరికి యిద్దరం కలిసి తిన్నాం. భోజ నం ముగించి లేచి, చేతులు కడుక్కుంటుం డగా అన్నయ్య వచ్చాడు. వస్తూనే కుర్చీ లాక్కుని కూర్చుని పగలబడి నవ్వుతూ,

తాతయ్య పడుతున్న అవస్థ విన్పించాడు. అన్నయ్యని చూడగానే బావురుమని ఏడిచాట్ట. పోలీసుల దగ్గిర రిపోర్టు యిచ్చాడు. వాళ్లు వచ్చి చూశారు. ఇంట్లో సామానేం పోలేదు. తలుపులు గాని, కిటికీలుకాని బలవంతంగా తెరిచిన జాడకూడా లేదు. వాళ్లు విచిత్రంగానే వుంది అన్నారట. తాతయ్య వైపు అనుమానంగా చూస్తూ "మీ మనవరాలికి యింకెవరితో పరిచయం లేదుకదా?" అని అడిగారుట. తాతయ్య లేదని తిరస్కరించాడు.


వాళ్ళని పంపించేందుకు బైటకి వచ్చిన అన్నయ్య వాళ్ళతో: 'దొంగలెత్తుకుపోవటం అంటే నేనుకూడా నమ్మలేకుండా వున్నాను. మా తాతయ్య పీనాసితనంతో యీ యింట్లో బాధపడలేక అది చచ్చిపోయి అయినా వుండాలి, లేక ఎవరితోనైనా వెళ్ళిపోయి వుండాలి' అని చెప్పాట్ట. వాళ్ళుకూడా 'అదే నిజంలా వుంది' అని వెళ్ళిపోయారుట. ఇటు తాతయ్యతోనేమో 'తాతయ్యా! మొన్న ఆకాశరామన్న వుత్తరంతో జరిగిన గొడవతో వాళ్ళకి అసలే అనుమానంగా వుంది. దానికిది బలం యిస్తుందేమో' అన్నాట్ట. తాతయ్య భయపడ్డాడట. అన్నయ్యతో ఎన్నడూ లేనంత ఆప్యాయంగా మాట్లాడాడుట. 'ఏం చేద్దాంరా అబ్బాయి; నాకు కాళ్లూ చేతులూ ఆడడం లేదు,' అన్నాట్ట.

'నాకు తెలిసిన పోలీస్ ఆఫీసర్ ఒకాయన వున్నాడు. ఆయనచేత రహస్యంగా వెతికిద్దాం,' అని సలహా చెప్పాట్ట వీడు.

అంతా చెప్పి ముగిస్తూ, "రాధా! తాతయ్యకి నీమీద నిజంగానే ప్రేమే. ఒక్క రాత్రిలో మనిషి ఎంత తీసేశాడని. కలం కాగితం తీసుకో. నేను చెప్పినట్టు వుత్తరం వ్రాయి," అని సిగరెట్ తీసుకుని వెలిగించుకున్నాడు.

నేను అయిష్టంగానే వుత్తరం వ్రాయటం మొదలుపెట్టాను. ఆరోజు సాయంత్రమే ప్రసాద్‌ని పంపించి తాతయ్య యెలా వున్నారో చూసిరమ్మని మరీ మరీ అడగటంతో, అతను అన్నయ్యకోసం వెళ్ళినట్టు వెళ్ళి, చూసివచ్చి, తాతయ్యని గురించి చెప్పాడు.

రెండురోజులు అయింతర్వాత మాకు కొత్త సమస్య ఎదురైంది. తాతయ్యకి నేను వ్రాసిన వుత్తరం అందింది. అది చూడ



గానే ఆయన మతిపోయినంత పనైంది. భయంకూడా పట్టుకుంది. అన్నయ్య చేయి పట్టుకుని "గోపీ, రాత్రిళ్ళు నువ్వు యింట్లో వుండకపోతే ఈ దొంగ లెవరో వచ్చి, నన్ను గుటుక్కుమనిపించేస్తారు. నువ్వు బైటకి వెళ్ళొద్దు." అన్నాడు.

"నువ్వక్కడ వుంటే, యిక్కడ నేను ఒకదాన్ని యెలా?–" అన్నాను ఖంగారుగా.

"ఏం? భయం ఏముంది? ఆ గదిలో నువ్వు తలుపులేసుకుని పడుకో. ప్రసాద్ ఇవతలే వుంటాడుగా."

నాకు ఒళ్ళు మండిపోయింది. జీవితంలో ఎప్పుడూ రానంతకోపం వచ్చింది. "ఒక్క రెండురోజులే. అందులో ప్రసాద్‌కి నైట్ డ్యూటీ కాదుకూడా." నేను ప్రసాద్‌వైపు చూశాను. అతనిముఖంలో ఎలాటి భావం లేదు. పుస్తకంలోకి చూస్తూ కూర్చున్నాడు.

"ఏం ఫర్వాలేదులే," అని ధీమాగా వెళ్ళిపోయాడు అన్నయ్య.

డబ్బుయావలో వాడి నిర్లక్ష్యానికి నిజంగా నాకు అసహ్యం వేసింది. ప్రసాద్ బైటకి వెళ్ళిపోయేముందు బైట తాళం వేసి వెళ్ళి పోతాడు. అయినా సరే, నేను లోపల గడియ వేస్తాను. అతని మాటలో శబ్దమో విన్పించగానే లోపలగడియ తీసేస్తా.

నా వుత్తరం అందగానే తాతయ్య అన్నయ్యని వెంటబెట్టుకుని పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి సంగతంతా చెప్పి జేబులోంచి వుత్తరం తీయబోతే–లేదుట. నేను బైలుదేరేముందు కూడా పెట్టుకున్నాను. ఎలా పోయిందో అంటాడుట యీయన. అన్నయ్య కళ్ళ సౌజ్ఞలు చూసి, వాళ్ళు యీయనని ఒక వెర్రిబాగులవాడిక్రింద కట్టేసి "మేంచూస్తాం లెండి; మీరు నిశ్చింతగా వుండండి," అని హామీ యిచ్చారుట.

అన్నయ్య యీ విషయంలో అస లేం మాట్లాడలేదు. ఆయన ఔనంటే ఔను అంటున్నాడు. కాదంటే కాదంటున్నాడు.

మరో రెండురోజుల తర్వాత తాతయ్య 50 వేలు యివ్వటానికి నిశ్చయించుకున్నాట్ట. అన్నయ్య మాంఛి హుషారుగా వున్నాడు. 'ఇంకా రెండురోజుల్లో పనైపోతుందిలే' అన్నాడు.

ఆరోజు రాత్రి– బాగా చెమటలుపోయటంతో ఎంతకీ నిద్రపట్టలేదు. మెలకువ వచ్చింది: దాహం వేసింది. మెల్లగా తలుపు తీశాను. టేబిల్‌మీద లైటు వెలుగుతోంది. ప్రసాద్ పడక్కుర్చీలో పడుకుని అలాగే నిద్రపోతున్నాడు. గుండెలమీద పుస్తకం వుంది. నేను చప్పుడు చేయకుండా వెళ్ళి నీళ్ళు తీసుకుని తాగేశాను.

మళ్ళీ, వచ్చినంతనిశ్శబ్దంగా తిరిగి రాబోతూండగా టేబిల్‌లైటు వెల్గడం కన్పించింది. దాన్ని తీసేశాను. తీసేసేముందు లిప్తపాటు నాకళ్ళు అతనిముఖంమీద నిల్చాయి. మంచి నిద్రలో వున్నట్టు క్రమంగా వస్తున్న వుచ్ఛ్వాస నిశ్వాసాలు తెలుపుతున్నాయి. 'డాక్టర్లకుండాల్సిన సరళత్వం, నిశ్చలత్వం వున్నాయి యితనికి' అనుకున్నాను.

గుండెలమీద పుస్తకం కూడా తీద్దామనుకున్నాను. కానీ అంతలోనే విరమించుకుని లైటుమాత్రం తీసేసి వెళ్ళిపోయాను. ఆతర్వాత నిద్ర పట్టేవరకూ నా కళ్ళముందు నిర్మలంగా వున్న అతని ముఖమే కదులుతోంది.

తెల్లవార బోతుండగా నిద్ర పట్టింది. నిద్రలో ప్రసాద్ రెండుచేతుల్తో నాముఖం పట్టుకునీ 'ఏదీ, యిటుచూడు రాధా – రాధా– అంటూ నవ్వించటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

మెలకువ వచ్చేసరికి బైటనుంచి తలుపు తడుతూ నిజంగానే 'రాధా – రాధా అని పిలుస్తున్నాడు. వులిక్కిపడి లేచికూర్చున్నా. కిటికీలోంచి ఎండ వొచ్చి కాళ్ళవైపు పడుతోంది.

"రాధా!" ప్రసాద్ మరోసారి పిల్చాడు.

"వస్తున్నా." ఒక్కవుదుటన దిగి చప్పున వెళ్ళి తలుపు తీశాను.

"నా బట్టలు యిక్కడున్నాయి. టైమయిపోతోంది. అందుకని –" నాప్రక్కనుంచి లోపలికి వెళ్తూ అన్నాడు. అప్పుడే స్నానం చేశాడులావుంది – సబ్బువాసన తెలివస్తోంది. నేను యివతలగదిలోకి వచ్చాను. ఐదు నిముషాల్లో బట్టలేసికొనటం పూర్తిచేసి యివతలకి వచ్చాడు.

ఆలస్యం అయిందంటూనే గబగబా వెళ్ళి కాఫీ తెచ్చిపెట్టేసి వెళ్ళిపోబోయాడు. అతను తాగలేదేమో అన్న అనుమానం వచ్చింది.

"మీరు తాగారా?"

"లేదు. టైమయిపోయింది. ఫర్వా లేదులే."

"ఒక్క నిముషం." చప్పున గ్లాసులో పోసి తెచ్చియిచ్చాను. అతను తిరస్కరించలేకపోయాడు. తీసుకుని తాగుతూ "రాత్రి లైటు నువ్వు తీశావా?" అన్నాడు.

'ఔను' అన్నట్టుగా తలూపాను.

"చదువుతూనే వున్నాను. నిద్ర పట్టేసింది." అన్నాడు. రాత్రి నిద్రపోతున్న ఆ ముఖానికి అట్టే వ్యత్యాసం కన్పించలేదు నాకు. స్థిరమైన స్వభావం కలవాళ్ళే అలా వుండగలరని నాకు తెలుసు.

రోజంతా క్షణం తీరుబడి లేకుండా పని చేసే నాకు యిలా ఖైదీలా నాలుగ్గోడల మధ్య కూర్చోవాలంటే ప్రాణం పోయినంత పనిగా వుంది. ఆ పుస్తకాలు ఎంత సేపని చదువను? ఓ చెంప తాతయ్య ఎలా వున్నాడో అనే ఆరాటం మనసుని తినేస్తూంది. ఏమైనాసరే, ఈ సాయంత్రం అన్నయ్య రాగానే 'యీ నాటకం చాలు' అని ఖచ్చితంగా చెప్పేయాలని గట్టిగా నిశ్చయించుకుని, అన్నయ్యకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. కానీ ఆ సాయంత్రం ఎందుకో కాని అన్నయ్య రానేలేదు. ఇటు ప్రసాద్‌కూడా రాలేదు. చీకటి పడిపోయింది. ఓచెంప ఒంటరిగా వున్నాననే దిగులూ, మరో ప్రక్క ఆకలిబాధ. నా వయసులోవున్న ఆడపిల్లలు ఎంతో సరదాగా, సుఖంగా, నవ్వుతూ, తుళ్ళుతూ, చదువులతోనో, ఆటపాటలతోనో గడపటం ఎరుగుదును. నా ఖర్మ యిలా యెందుకవాలి?

అన్నయ్యకీ, తాతయ్యకీ ఏమాత్రం సామరస్యం వున్నా నా జీవితం పూర్తిగా వేరుగా వుండేది. వయసుకి మించిన ఆలోచనలవల్ల జీవితం పట్ల ఆసక్తి యిగిరిపోతోంది. ఒంటరిగా ఒక్కదాన్నీ కూర్చుని నన్నుగురించి నేను ఆలోచించుకోవడం యిదే మొదటిసారి. హఠాత్తుగా ఒక్కసారి ఆపుకోలేనంతగా పెద్దపెట్టున ఏడుపు వచ్చేసింది. దిండులో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా ఏడవసాగాను. (ఈ దిండుకూడా ప్రసాద్ యిచ్చింది. తల క్రింద ఎత్తు లేకపోతే నాకు నిద్రపట్టదు. వున్న ఒక్క దిండూ అతనువేసుకుంటున్నాడు. నేను చీరెలు రెండు మడతపెట్టి తలక్రింద ఎత్తుగా పెట్టుకున్నాను. ప్రసాద్ యిది చూశాడు కాబోలు. ఓసారి నేను బాత్‌రూమ్‌లో స్నానం ముగించుకుని యివతలకు వచ్చేసరికి అతను చీరెలు తీసి, దిండు వాటిస్థానంలో పెడుతున్నాడు. హఠాత్తుగా నేను రాగానే కొద్దిగా సిగ్గుపడ్డాడు. ఆపని చాలా చిన్నదే అయినా, నా హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయింది. అన్నయ్యకికాని, తాతయ్యకికాని నేనెంతో చాకిరీ చేస్తాను. వాళ్ళెనాడూ నామీద యింత చిన్న ఆసక్తినికూడా కన్పించిన పాపాన పోలేదు. ఎదుటివాళ్ళ మన సుఖాల్ని గురించి ఆలోచించటంలో అది మన కెంత హాయినీ, తృప్తినీ కల్గిస్తుందో మొదటిసారిగా తెలిసింది నాకు. ప్రసాద్‌కి నిజంగా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పాలనిపించింది. కానీ అతను నవ్వేస్తాడేమో అనే భయంతో ఆగిపోయాను.)

రాత్రి పొద్దుపోయిం తర్వాత ప్రసాద్ వచ్చాడు. నేను కళ్ళు తుడుచుకుని, ముఖం నీళ్ళతో కడుక్కుని వచ్చేను. సరే అతను తలుపుతట్టాడు. గబగబావెళ్ళి తలుపుతీశాను.

"ఇదేమిటి? లోపల గడియ వేశారా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఇంత ఆలస్యం అయిందేం? అన్నయ్య యివాళ ఎందుకో రానేలేదు." అన్నాను.

"మీ తాతయ్యకి గుండెల్లో నొప్పెట్టిందిట. అందుకని రాలేదని చెప్పమని నాకు హాస్పిటల్‌కి ఫోన్‌చేశాడు." చేతులో స్టెతస్కోప్, కోటూ టేబిల్‌మీద పడేస్తూ అన్నాడు. అతని ముఖంకూడా అలసటగా వుంది.

"తాతయ్యకి నొప్పివచ్చిందా! అయితే నేను వెంటనే వెళ్ళాలి," అన్నాను.

"నిన్ను తీసుకురమ్మనమని చెప్పలేదు నాకేం." అన్నాడు.

"వాడు చెప్పినా చెప్పకపోయినా నేను వెళ్ళాలి. గుండెల్లో నొప్పి వస్తే తాతయ్య అసలు మాటకూడా మాట్లాడలేడు. ఆయనకి ఎప్పుడు ఏం చెయ్యాలో నాకుతప్ప యింకెవరికీ తెలియదు."

"నన్ను తీసుకెళ్ళేగాని వీల్లేదని గట్టిగా పట్టుబట్టాను.

"కాని, గోపి.." అతను సందేహించాడు.

"వాడిసంగతి నాకు వదిలేయండి. మీరు నన్ను తీసుకువెళ్ళకపోతే ఎలాగో ఇబ్బంది పడి నేనే వెళ్తా," అన్నాను.

ప్రసాదు తప్పనిసరిగా తాళంవేసి బైలుదేరాడు.

స్కూటరుమీద కూర్చుని ప్రయాణం చేయటం నాకు అలవాటులేదు. అది కదలగానే ఎక్కడ పడిపోతానో అని ప్రసాదు భుజం గట్టిగా పట్టుకున్నాను. అతనికి చక్కిలిగింతలు అన్పించిందో ఏమిటో, ఒకటి రెండుసార్లు మెడ ప్రక్కకి వంచి చెంపతో నా చెయిమీద గట్టిగా నొక్కాడు.

పదిహేను నిమిషాల కిల్లు చేరాం. ఇల్లు చూడగానే నాకు ప్రాణం లేచివచ్చినట్టయింది. సరాసరి తాతయ్య గదిలోకి పరుగెత్తా. తాతయ్య మంచంమీద ఎత్తుగాపెట్టిన దిండ్లకి ఆనుకునికూర్చుని బాధ భరించలేనట్టు కళ్ళు మూసుకునివున్నాడు. అన్నయ్య మంచం ప్రక్కనే నిలబడి తాతయ్యకి ఏమిటో చెబుతున్నాడు.

"తాతయ్యా!" పిలుస్తూ దగ్గరకు పరుగెత్తాను.

అన్నయ్య చివ్వున ఇటుతిరిగి నన్ను చూడగానే నిర్ఘాంతపోయాడు. తాతయ్య కళ్ళు దించి క్షణంసేపు కలో నిజమో అర్థంగానివాడిలా చూశాడు.

"తాతయ్యా — నేను — నేను" అన్నాను.

"అమ్మడూ!" రెండుచేతులూ జాచాడు.

"తాతయ్యా, యిదంతా అన్నయ్య చేసింది—" అంటూ జరిగిందంతా క్లుప్తంగా నాలుగువాక్యాల్లో చెప్పేశాను.

వింటూండగానే తాతయ్యముఖం కందగడ్డలా తయారైంది. "ఆ! ఆ! నిజంగా. ఏదీ నాకట్టు—" అంత ఆయాసంలోకూడా రొప్పుతూ కట్టుకోసం చేయి జాచాడు. ఆ వెండిపొన్నుకట్టు చూసిన తర్వాతగాని నేను చేసిన పనేమిటో నాకు గుర్తుకురాలేదు. పాలిపోయిన ముఖంతో అన్నయ్యవైపు చూశాను. వాడు నావైపు మింగేసేట్టు చూసి గదిలోంచి వెళ్ళిపోయాడు.

ప్రసాద్ ఆదుర్దాగా వచ్చి తాతయ్య చేతిని తీసుకుని నాడి చూడసాగాడు.

ఆరాత్రి తాతయ్యకి పక్షవాతం వచ్చింది.

తనువేసుకున్న పథకం అంతా గంగలో కలిసినందుకు నన్నేకాకుండా ప్రసాద్‌ని కూడా ఛడామడా మాట లనేసి అన్నయ్య యింట్లోంచి వెళ్ళిపోయాడు. ఇంట్లో నేను ఒక్కదాన్ని. తాతయ్య నోటి మాటకూడా పోయింది. నా అవస్థ చూడలేక, ప్రసాద్ రోజూ వచ్చి రెండుమూడు గంటలు కూర్చుని ధైర్యం చెప్పి వెడుతూవుండేవాడు.

రెండు నెలలు గడిచాయి. ఈ రెండు నెలల్లో ప్రసాద్ తాతయ్యకి బాగా చనువయ్యాడు. నాక్కూడా కొద్దికొద్దిగా అర్థం అయాడు. ప్రసాద్, ఏం నచ్చచెప్పాడో ఏమిటో, అన్నయ్య ఒకటిరెండుసార్లు వచ్చి తాతయ్యని చూసివెళ్ళాడు, కానీ నాతో ఒక్క మాటకూడా మాట్లాడలేదు. నా కెంత బాధనిపించిందో!

తాతయ్య ఆరోజు నన్ను దగ్గిర కూర్చోపెట్టుకుని 'ప్రసాద్ గురించి నీ వుద్దేశ్యం ఏమిటమ్మా?' అంటూ అడిగాడు. నేను తెల్లబోయాను. 'ఈ ఆస్తినీ, నిన్నూ ఒక సురక్షితమైన వ్యక్తికి అప్పగించి పోతేగాని నాకు మనశ్శాంతి వుండదే

అమ్మాయి. యిలా నిన్ను అర్ధాంతరంగా వదిలి గుటుక్కు మన్నానంటే ఆ త్రాష్టుడు నిన్ను ముప్పతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాడు."

"ప్రసాద్ నీకు నచ్చాడా తాతయ్యా!"

తాతయ్య వచ్చాడన్నట్టు చూశాడు. నేనేం సమాధానం చెప్పలేదు. నాకు అతనంటే ప్రత్యేకమైన యిష్టం అంటూ ఏర్పడక పోయినా, అయిష్టం మాత్రంలేదు.

తాతయ్య ఆరోజే లాయర్ని పిలిపించి, విల్లు వ్రాయించాడు. ఆయన కున్నదంతా నయాపైసల్తో, చివరికి వెండిపొన్ను వున్న చేతికఱ్ఱతోసహా అంతా నాకే చెందుతుంది. కానీ, నేను దీన్ని ప్రసాద్ అనుమతిలేకుండా ఏం చెయ్యటానికీ వీల్లేదు.

"తాతయ్యా! ఇది చాలా అన్యాయం–" అన్నాను.

"నువ్వూరుకో." తాతయ్య కసిరాడు.

మరుసటిరోజు సాయంత్రం రిజిష్ట్రార్ మా యింటికే వచ్చి, తాతయ్య మంచం ప్రక్కనే కూర్చుని మా యిద్దరికీ వివాహం చేశాడు. ప్రసాద్ తన చేతికున్న వుంగరం తీసి నా వేలికి తొడిగాడు. తాతయ్య అతనికి కట్నంగా నాచేత 10 వేలకు చెక్ యిప్పించాడు. అంతే. మా పెళ్ళి అయిపోయింది.

నాలుగురోజుల తర్వాత అర్ధరాత్రి ఒంటిగంటకి తాతయ్య పోయాడు. చిక్కిపోయి, సగభాగం చచ్చుపడిపోయిన ఆ శరీరాన్ని వదిలి వెళ్ళటానికి ఆ ప్రాణి ఎంత పెనుగులాడిందో చెప్పలేను. నాకు విపరీతమైన వైరాగ్యం కలిగింది. నాకు బుద్ధి తెలిసిన తర్వాత అంత దగ్గిరగా మృత్యువుని చూడటం అదే మొదటిసారి. భయంతో కళ్లు వెడల్పు చేసుకుని చూస్తున్న నన్ను ప్రసాద్ మెల్లిగా చేయిపట్టి లేవదీసి బలవంతంగా యివతలికి తీసుకువచ్చాడు.

"ప్రసాద్–" నే నేదో చెప్పబోయాను. కానీ అతను నన్నేం చెప్పనీయలేదు. నా చెయి తన రెండు చేతుల్లోకి తీసుకుని, నా కళ్ళలోకి చూస్తూ, "జీవితం అంటేనే అంత. అందుకే యిది అశాశ్వతం అని మనం మనసులో ఓ మూల ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటే, బ్రతుకు మనం వూహించినంత ఆరాటంగా కానీ, సమస్యల మయంగా కానీ కన్పించదు. నువ్విక ఆ గదిలోకి నేను చెప్పేవరకూ రావద్దు." ఆజ్ఞాపిస్తున్నట్టుగా అన్నాడు. కళ్ళెత్తి చూశాను. అతని కళ్ళలో ఆప్యాయత తొణికిసలాడుతోంది. తాతయ్య చనిపోతూ నన్ను యితని చేతుల్లో అప్పగించినందుకు హాయిగా అన్పించింది. 'సరే' అన్నట్టు తలూపాను.

తర్వాత అరగంట దాటిన తర్వాత అన్నయ్య కూడా వచ్చాడు. అంతా సవ్యంగానే జరిగిపోయింది. వారం రోజులు యిట్టే గడిచిపోయినాయి. తాతయ్య యింకా యింట్లో ఏ గదిలోనో వున్నట్టేవుంది నాకు.

ఆ రోజు సాయంత్రం నా గదిలో కూర్చుని మేం ముగ్గురం కాఫీ తాగుతున్నాం.

కాఫీ తాగుతుండగా ప్రసాద్ జేబులోంచి పర్స్ తీసి, తాతయ్య పెళ్ళి టైములో యిచ్చిన చెక్ తీసి అన్నయ్యకిచ్చేశాడు.

అన్నయ్య అది తీసుకుంటూ "రాధా! ప్రసాద్‌కీ నీకూ జరిగిన రిజిష్టర్ మ్యారేజ్ చెల్లదు." అన్నాడు.

"అంటే?" దిగ్భ్రాంతురాలనైనట్టు చూశాను.

"అంటే–" అన్నయ్య వివరిస్తున్నట్టుగా అన్నాడు. "ఆరోజు వచ్చిన రిజిస్ట్రార్ నిజమైన రిజిస్ట్రార్ కాదు."

నేను తెల్లబోయినదానిలా ప్రసాద్ వైపు చూశా. ఎందుకోకాని అతని ముఖం ఎర్రబడివుంది.

"కాబట్టి– తాతయ్య నీకు వ్రాసిన విల్లు చెల్లదు. ఆస్తి నాకు వస్తుంది. నాకంటే తెలుసుగా, దేశానికి. ఇదంతా రక్షణనిధికి యిచ్చేసి నేను సైన్యంలో చేరిపోతున్నాను."

ఎంతసేపూ డబ్బు – డబ్బు – డబ్బుకోసం నే నెప్పుడూ ఆశపడలేదు. తాతయ్య విల్లు అలా రాసినా ఇవాళో రేపో అది మార్పించేసి అన్నయ్యకి యివ్వాలనే అనుకుంటున్నాను. డబ్బు నాది అయినా కాకపోయినా నాకు బాధ లేదు. కానీ–ప్రసాదు–అతనుకూడా అన్నయ్యలాటి వాడనీ, లోలోపల వుప్పెనలా వచ్చిన ఈ ఆలోచనలన్నీ వాళ్ళ ముఖంమీద అడిగేయాలనుకున్నాను. కానీ గొంతుకి ఏదో అడ్డం పడినట్టవడంతో నిశ్శబ్దంగా లేచి నా గదిలోకి వెళ్ళిపోయాను.

డబ్బంతా రక్షణనిధికి యిస్తాట్ట, తను సైన్యంలో చేరిపోతాట్ట. ప్రసాదుదారిని ప్రసాదు పోతాడు. మరి నేను? నా సంగతేమిటి? అన్నయ్యకి యీ ఆలోచన ఎందుకు రాలేదు? ఎలా వస్తుంది. ఎంతసేపూ దేశం దేశం అంటూ దానిగొడవ తప్పితే వాడిసంగతే వాడికి పట్టనిమనిషి అయితే! తాతయ్య నాకూ, నా పొట్ట నేను పోసుకుని, నా కాళ్ళమీద నేను నిలబడగలిగేందుకు అర్హత యిచ్చే కనీసచదువైనా చెప్పించలేదు. చెప్పానుగా! ఒకళ్ళకి డబ్బుమీద ప్రీతి. మరొకరికి దేశం అంటే భక్తి. ఈ యిద్దరిమధ్యా నా జీవితం ఛిన్నాభిన్నం అవటంతో ఆశ్చర్యం ఏముంది. మనసంతా వ్యాపించిన ఆరాటాన్ని నిగ్రహించుకునే ప్రయత్నంలో వూరికే చేతివేళ్ళు గుంజుకుంటున్న నాకే, హఠాత్తుగా నాదృష్టి చేతి వేలుమీద పడింది. రిజిష్ట్రారు అబద్ధం. పెళ్ళి అబద్ధం. అలాటప్పుడు వుంగరం పెట్టుకునే అర్హత నా కెక్కడిది.

ఇంతలో వెనుకనుంచి 'రాధా' అని విన్పించింది. చివ్వున వెనక్కు తిరిగాను. గుమ్మంలో ప్రసాదు నిలబడివున్నాడు. ఎల్లవేళలా ఆనందంగా, నిశ్చలంగా వుండే అతను, యీ క్షణంలో ఏవో ఆందోళనకి గురి అవుతున్నట్టుగా, ముఖంలో తొంగిచూస్తున్న ఆవేదన చెప్తూంది.

గుమ్మంలో నిలబడే అన్నాడు అతను. "రాధా! ఒక్కమాట చెప్పివెళ్ళటానికి వచ్చాను. రిజిస్ట్రారుమాట అబద్ధం అని నాకు ముందే తెలిసినా, ఆ రోజు మీ తాతయ్య ముందు నీచేతికి ఆ వుంగరం నేను మనస్ఫూర్తిగానే పెట్టాను. ఆరోజే అమ్మకి

యింటికి వుత్తరం వ్రాశానుకూడా. నిన్ను వెంటనే తీసుకువచ్చి తనకి చూపించమని జాబు వ్రాసింది, ఇదిగో వుత్తరం;" అతను వుత్తరం తీసిచ్చాడు. కానీ నేను తీసుకోలేదు.

కొద్దిగా ఆగి మళ్ళీ అతనే అన్నాడు. "జరిగిందంతా మర్చిపోయి నన్ను స్వీకరించు రా... లేకపోతే–లేకపోతే–" ఎడం చెయ్యి గుండెమీద పెట్టుకుంటూ. "ఇక్కడ అశాంతీ, అసంతృప్తీ స్థిరనివాసం ఏర్పరుచుకుని, జీవితాంతం నన్ను వేధిస్తాయి," అన్నాడు.

నేను కళ్ళెత్తి సూటిగా, పరీక్షగా అతని వైపు చూశాను. జరిగిదానికి అతను హడావుడిపడిపోవటంలేదు. ఆర్భాటంగా తను నిర్దోషినని నిరూపించాలని గబగబా మాట్లాడటంలేదు. జరిగిదానిని ఒప్పుకుని, జరగబోయేదానికి మనస్ఫూర్తిగా తనేది కోరుకుంటున్నాడో, నిశ్చలంగా నిలబడి తణుకు బెణుకు లేకుండా చెబుతున్నాడు. అలాటి నిశ్చలమైన ప్రకృతిగల మగవాడి నీడలో ఆడదాని జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగుతుందని నాకూ తెలుసు. ఒకవేళ నేను కాదంటే అతనికి మనసులో బాధ వుంటే వుండవచ్చు. కాని అదిమాత్రం బైటపడనివ్వడు.

నిశ్శబ్దంగా మరోమాట చెప్పకుండా తిరిగి వెళ్ళిపోయాడు.

నా జవాబుకోసం నిలబడి చూస్తున్నట్టుగా వుంది అతనిముఖం

ఏం చెప్పాలో తోచలేదు నాకు. ప్రసంగం తప్పించటానికి "కాని – యిప్పుడు యిప్పుడు నాకేంలేదు. ఆస్థంతా అన్నయ్యకి వెడుతుంది," అన్నాను.

ప్రసాద్ రెండడుగులు వేసి దగ్గరగా వచ్చాడు నాచేతిని తనచేతిలోకి తీసుకుంటూ మృదువుగా "ఆస్థికోసం నేను నిన్ను చేసుకున్నట్టయితే యీ క్షణంలో యిక్కడ వుండేవాడినేకాదు. నేను నీలో ఏం చూసి నిన్ను భార్యగా పొందాలని అనుకుంటున్నానో అది నీలో ఎప్పుడూ వుంటుందని నాకు నమ్మకంగా తెలుసు," అన్నాడు.

నేను సమాధానం చెప్పలేదు. పదినిముషాలక్రితం నిర్జీవంగా, కన్పించినప్రపంచం మళ్ళీ యిప్పుడు సజీవంగా కన్పిస్తోంది నాకు.

"ఏమిట్రా! రెండునిముషాలు మాట్లాడాలని, పావుగంట దాటినా బైటకిరావు. మీ యిద్దరూ కలిసి నామీద ఏమైనా మంత్రాంగం చేస్తున్నారా?–"

ప్రసాద్ వెనక్కి తిరిగి నాచేయి వదలకుండానే "గోపీ, మన ఒప్పందం ప్రకారం ఆస్థిమాత్రమే నీకు తిరిగి యివ్వాలి. మీ చెల్లెల్నిమాత్రం కాదు," అన్నాడు.

"ఊ...హూ" అన్నయ్య నోటితో విచిత్రంగా యీల వేశాడు. నావైపు ఆసక్తిగా చూస్తూ "శుభం. అయితే యిదుగో– నా కట్నం తాలూకు సొమ్ము," అంటూ చెక్ తీసి యిచ్చాడు.

ప్రసాద్ వాడిచేతిని దూరంగా నెట్టూ "కట్నం తీసుకోకుండా చేసుకునే భర్త దొరికాడు మీ చెల్లెలికి. అంతగా అయితే అది మా తరఫున రక్షణనిధికి విరాళంగా యిచ్చెయ్యి," అన్నాడు.

"వాట్! నిజంగా. యిప్పుడే వ్రాసుకుంటాను." అన్నయ్య నోట్ బుక్ తీసుకుని 'మిస్టర్ & మిసెస్ ప్రసాద్ పదివేలు'–అని అంతలోనే నాలుగు రోజుల్లో మనశాస్త్రిగారు రాబోతున్నారు. ఆయనకిమీయిద్దరే స్వయంగా ఇవ్వం?'' డన్నాడు. ★

